

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్

ప్రజాశక్తి - మండవల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి మరింత బలోపేతం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని అయ్యవారి రుద్రవరం, మండవల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలను, మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచి మౌలిక వసతులను ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన పాఠశాల ప్రహరీ గోడను తిరిగి నిర్మించేందుకు నిధులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు.

ఒక్క ఇల్లూ కట్టలేదు.. స్థలమూ ఇవ్వలేదు..!

'ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ ఒక్క ఇల్లు కట్టుకునేందుకూ మన ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. ఇంటి నిర్మాణాలు ప్రారంభించకపోతే తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలి'.. ఇటీవల జరిగిన ఏలూరు జిల్లా డిఆర్‌సి సమావేశంలో ఎంఎల్‌ఎలు లేవనెత్తిన ప్రశ్న ఇది.



ఏడాది దాటిన కూటమి పాలన

ఇప్పటి వరకూ పేదలకు ఒక్క ఇల్లు, స్థలమూ మంజూరు కాని దుస్థితి

ఇళ్లు కట్టుకునేందుకు రెండు జిల్లాల్లో 38 వేల వరకూ కొత్త దరఖాస్తులు

ఏలూరు జిల్లాలో 30,800, పశ్చిమలో 7,612 దరఖాస్తులు

డిఆర్‌సి సమావేశంలోనూ ఎంఎల్‌ఎలు ఇదే విషయంపై గగ్గోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌ఎలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను సైతం ఇళ్ల నిర్మాణం కోసం జనం నిలదీస్తున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ఇప్పటి వరకూ సామాన్య ప్రజానీకం సొంతింటి కలకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు వేయని పరిస్థితి. దీంతో ఇంటి నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం 30,800 దరఖాస్తులు వచ్చాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 7,612 దరఖాస్తులు గృహనిర్మాణ శాఖకు చేరాయి. కొత్త ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండాపోయింది. దీంతో దరఖాస్తులన్నీ అలానే ఉండిపోయాయి. కొత్త ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2.50 లక్షలు ఇస్తామని చెప్పడం తప్ప ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మంజూరు ప్రక్రియ లేకుండాపోయింది. దీంతో ఎంతోమంది సామాన్య ప్రజానీకం ఇంటి నిర్మాణం కోసం పడిగాపులు పడుతున్న పరిస్థితి ఉంది. దరఖాస్తు చేసుకుని ఇంకా నిరీక్షించలేక అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి సాయం అందుతుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం ఏలూరు జిల్లాలో లక్షా రెండు వేల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. గడిచిన ఐదేళ్లతోపాటు ఇప్పటి వరకూ జరిగిన ఇళ్ల నిర్మాణం 60 వేలు వరకూ ఉన్నాయి. ఇంకా 40 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం జరగలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో గత ప్రభుత్వంలో 73,792 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా ఇప్పటి వరకూ 35,784 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 38 వేల ఇళ్ల నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన పనులు మాత్రమే సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రోజులు గడిచిపోతున్నా కొత్త దరఖాస్తులకు మాత్రం మోక్షం కలగడం లేదు. దీంతో కొత్త ఇంటిని నిర్మించుకోవాలన్న కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఎంఎల్‌ఎల్లోనూ అసహనం వ్యక్తమవుతోంది.

ఒక్క స్థలమూ ఇవ్వలేదు

గత వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటిస్థలం ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించడంతోపాటు మేనిఫెస్టోలోనూ పెట్టారు. అధికారంలోకొచ్చి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకూ ఒక్క స్థలమూ ఇవ్వలేదు. ఇంటి స్థలాలకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కలు కూడా చెప్పడం లేదు. భూసేకరణ చేసి ఇంటిస్థలం ఇస్తామని చెబుతూ కాలక్షేపం చేస్తున్నారు. దీంతో ఇంటిస్థలం అనేది సామాన్యులకు దక్కుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇళ్ల నిర్మాణం, ఇంటి స్థలాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై జనాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది.

శాంతించిన వరద గోదావరి


ముంపులోనే గుండేటి వాగు కాజ్‌వే

భద్రాచలంలో 35 అడుగులకు తగ్గిన నీటిమట్టం

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద ఎట్టకేలకు శనివారం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం భద్రాచలంలో 44 అడుగులు ఉన్న నీటిమట్టం శనివారం నాటికి 35 అడుగులకు తగ్గింది. ఇప్పటికే వారం రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ఇంకా ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గ్రామాలకు రాకపోకలు పున:ప్రారంభం కాలేదు. వరద తగ్గుముఖం పట్టడంతో ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై వరద నీరు తగ్గడంతో రాకపోకలు యధావిధిగా సాగుతున్నాయి. వరద తగ్గుముఖం పట్టినా గుండేటి వాగు కాజ్‌వేపై నుంచి వరద నీరు వీడాలంటే నాలుగైదు రోజులు పడుతుంది. ఏదేమైనా గోదావరి వరద శాంతించడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద తగ్గడంతో మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే భద్రాచలం వద్ద గోదావరి 25 అడుగుల దిగువకు తగ్గితేగాని ప్రధాన రహదారులన్నీ ముంపు నుంచి బయటపడే అవకాశం లేదు. మండల కేంద్రం నుంచి సుమారు రేపాకగొమ్ము గ్రామానికి రాకపోకలు సాగుతున్నాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోట వెళ్లడానికి, కోయిదా వెళ్లే మార్గంలో గోదావరి వరద తగ్గకపోవడంతో కోయిదా, కట్కూరు, యడవల్లి, తాళ్లగొంది తదితర 15 గ్రామాలకు రాకపోకలు పున:ప్రారంభం కాలేదు. దీంతో పడవలపైనే జనం రాకపోకలు సాగిస్తున్నారు.



వేలేరుపాడు రూరల్ : ముంపులోనే రుద్రంకోట రహదారి

పోలవరం: నాలుగు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి వరద శనివారం సాయంత్రానికి నిలకడగా మారింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,14,062 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 32.270 మీటర్లు. స్పిల్వే దిగువన 23.820 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 32.950 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 23.300 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.820 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

డిఎస్‌సిలో గోకుల్ సాయి అత్యుత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



డిఎస్‌సి-2025 ఫలితాల్లో పట్టణానికి చెందిన పోలుకొండ గోకుల్‌సాయి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో 84.33 మార్కులతో ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో టాప్ సెకండ్ ర్యాంకర్‌గా ఉద్యోగం సాధించారు. 2018 డిఎస్‌సిలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాచవరం ఎలిమెంటరీ పాఠశాలలో ఉద్యోగం సాధించారు. తాజాగా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. గోకుల్ సాయి తండ్రి పోలుకొండ పురుషోత్తమ దేవ్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఒ) స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్‌గా విధులు నిర్వర్తించారు. తల్లి నాగలక్ష్మి గురుకులం విద్యాసంస్థలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గోకుల్‌సాయి తాత పోలుకొండ ధనంజయరావు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తించారు. నానమ్మ మంగతాయారు గోదావరి జిల్లాలోని అలంపురంలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోకుల్‌సాయి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, మిత్రులు, గోకుల్‌సాయికి అభినందనలు తెలిపారు.

వేతన బకాయిలు తక్షణం చెల్లించాలి

కొనసాగిన శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ కార్మికుల ఆందోళన

మద్దతు తెలిపిన సిపిఎం, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - పోలవరం

అర్థాకలితో అల్లాడుతుతున్న శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ కార్మికుల 11 నెలల 15 రోజుల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టిసం (కన్నాపురం అడ్డరోడ్డు) వద్ద శ్రీ సత్యసాయి డ్రింకింగ్‌వాటర్ ప్రాజెక్ట్ వర్కర్స్ బకాయి వేతనాల కోసం చేపట్టిన నిరసనకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్ వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 17 మండలాల్లో 200 గ్రామాల్లో సుమారు ఆరు లక్షల మంది ప్రజలు రక్షిత మంచినీటిని సద్వినియోగం చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ఈ పథకంలో 18 ఏళ్లుగా 110 మంది కార్మికులు పని చేస్తున్నా కార్మికుల సంక్షేమం ఈ పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. 11 నెలల వేతన బకాయిలు ఉంటే కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుదీర్ఘ కాలంగా ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత, ఇన్సూరెన్స్, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు నేటికీ కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికలకు ముందు శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కార్మికులను దత్తత తీసుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరమైనా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులతో ప్రభుత్వం, అధికారులు తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఇతర సంఘాలు, ప్రజలను కలుపుకుని కార్మికులకు అండగా ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం దీక్షా శిబిరం నుంచి పోలవరం ఏటిగట్టు సెంటర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి.శివసత్యనారాయణ, సెక్రటరీ ఎ.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ బొంత ప్రసాద్, ఉప కార్యదర్శి ఎం.శ్రీనివాస్, సిహెచ్.పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి కార్మికులకు మద్దతు తెలుపుతున్న సిఐటియు, సిపిఎం నాయకులు

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం

జయంతి కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కె.వెట్రిసెల్వి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేతలు ఎంతమంది ఉన్నను ప్రజాభిమానాన్ని చూరగొనేది మాత్రం కొందరేనన్నారు. అలాంటి కొద్దిమంది నేతల్లో టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులుగా నిలుస్తారన్నారు. ఆంధ్రకేసరిగా ప్రసిద్ధి చెందారని, ఆంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా చేశారని, భారత స్వాతంత్ర సంగ్రామంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఆయన పేరున ప్రకాశం జిల్లాగా నామకరణం చేయడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.చల్లన్నదొర, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలో చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. అర్హులైనవారికి తల్లికి వందనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పడినట్లు చూపిస్తుందని కాని ఆ విద్యార్థికి తల్లికి కాకుండా వేరొక తల్లి ఖాతాలో డబ్బులు పడుతున్నాయన్నారు. ఈ లోపం ఎక్కడ ఉందో ప్రభుత్వాధికారికి తెలియాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ సొంత భవనాలు లేవని, వెంటనే సొంత భవనాలు కేటాయించాలని, హాస్టల్‌కు మెయింట్‌నెన్స్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూజివీడు అంటే ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచిందని కాని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. 25వ తేదీన జరిగే చలో కలెక్టరేట్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజివీడు పట్టణ నాయకులు ఎస్‌కె.నాని, అరుణ్, నవదీప్, చరణ్, సాయి, పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు

షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులు

పెరిగిన ఛార్జీలపై సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - మండవల్లి

కూటమి ప్రభుత్వంలో విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా పేదలతో కలిసి శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యుత్ తీగలే కాకుండా విద్యుత్ బిల్లులు సైతం షాక్ కొడుతున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి మాట మార్చారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించి, స్మార్ట్ మీటర్ ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 25న విద్యుత్ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

అప్పుడు అర్హులు.. ఇప్పుడు అనర్హులు..!

వికలాంగత్వం నిరూపించుకుంటేనే పింఛన్

20 ఏళ్ల నుంచి పెన్షన్ తీసుకుంటున్నా వైకల్య శాతం తగ్గిందనే పేరిట పింఛన్ రద్దు

జిల్లాలో 1289 మంది వికలాంగుల పెన్షన్ నుంచి వృద్ధాప్య పెన్షన్‌కు మార్పు

617 మంది వికలాంగుల పెన్షన్లు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - భీమవరం

వికలాంగులపై కూటమి ప్రభుత్వం కక్షగట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 20 ఏళ్ల నుంచి వికలాంగ పెన్షన్ పొందుతున్నప్పటికీ అనర్హులుగా గుర్తించి వికలాంగ శాతం తక్కువగా ఉందని సాకు చూపి తొలగిస్తోంది. మరోమారు వికలాంగత్వాన్ని నిరూపించుకోకపోతే రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో వికలాంగుల వైద్యుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అనర్హులను అర్హులుగా గుర్తించి వికలాంగుల పెన్షన్లు మంజూరు చేశారని కూటమి ప్రభుత్వం భావించి వికలాంగుల పెన్షన్ ఏరివేతకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో వికలాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ జరుగుతుంది. కూటమి ప్రభుత్వం పింఛన్ల సొమ్ము పెంచినట్లే పెంచి, పర్సంటేజీల షాక్‌తో వికలాంగుల పింఛన్లను తొలగిస్తోంది. వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం ధ్రువీకరణ చేయించుకోవాలని షరతు పెట్టింది. వికలాంగత్వం ఎంతుందో వైద్యులతో ధ్రువీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకురావాలని కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది. దీంతో గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులు ఒక్కసారిగా సదరం సర్టిఫికెట్ల కోసం సచివాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వికలాంగులకు వైకల్య శాతం తగ్గిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. వైకల్య శాతం 40 కంటే తగ్గిందనే సాకుతో చాలామంది పింఛన్లను తొలగిస్తున్నారు. దీంతో వికలాంగులు లబోదిబోమంటున్నారు. ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువుంటే వృద్ధాప్య పింఛనుగా మార్పు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందిస్తోంది. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో చాలామందికి అర్హత లేకపోయినా పైరవీలతో పెన్షన్ పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఏడాది జనవరి నుంచి పెన్షన్లు రీవెరిఫికేషన్ చేపట్టింది. జిల్లాలో సుమారు 27,582 మంది వికలాంగులు పెన్షన్లు పొందుతున్నారు. ఇప్పటి వరకు 15,596 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13,690 మంది మాత్రమే అర్హులని తేల్చారు. మిగిలిన వారిలో 1289 మంది వృద్ధాప్య పెన్షన్ పొందేందుకు అర్హులుగా గుర్తించారు. తనిఖీకి హాజరుకాని మరో 386 మందికి నోటీసులు అందజేశారు. అనర్హులుగా గుర్తించిన 617 మందికి వైకల్యాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో 1510 ఆరోగ్య పెన్షన్లు పొందుతున్న వారూ ఉన్నారు. ప్రత్యేకంగా నియమించిన వైద్యుల బృందం వీరిని ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసింది. వారిలో 586 మంది మాత్రమే అర్హులని తేల్చింది. మిగిలిన 944 మందిలో 603 మంది వికలాంగ, 341 మంది వృద్ధాప్య పెన్షన్లు పొందేందుకు అర్హులని తేల్చింది. గత 20 ఏళ్లుగా ఇస్తున్న పింఛను ఇప్పుడు ఎందుకు నిలిపివేస్తున్నారని పలువురు వికలాంగులు ప్రశ్నిస్తున్నారు. అయితే వికలాంగత్వం 40 శాతం కంటే తక్కువున్నా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛను కింద రూ.4 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కొంతమంది వికలాంగులు ఊరట చెందుతున్నారు.

వైద్యాధికారులు గతంలో ఇచ్చిన పత్రాలు చెల్లవట..!

2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.200 పింఛన్ తీసుకున్న వికలాంగులు అప్పుడు అర్హత సాధించి, ఇప్పుడు అర్హత లేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. అప్పుడు, ఇప్పుడూ రెండుసార్లూ తనిఖీలు చేసింది వైద్యులే. ఇప్పుడు అంగవైకల్యం తగ్గిందని ధ్రువీకరిస్తున్న ఈ డాక్టర్లది తప్పా, లేకపోతే అప్పుడు అంగవైకల్యం తక్కువున్నా ఎక్కువగానే ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చిన వైద్యులదా అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఏదేమైనా గత 20 ఏళ్ల నుంచి పింఛన్లు తీసుకుంటున్న వికలాం గులు ఇప్పుడు ఒక్కసారిగా అనర్హులు ఎలా అయ్యారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వికలాంగులంతా సదరం సర్టిఫికెట్లు చేయించు కోవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో వారంతా సర్టిఫికెట్ల కోసం వైద్యులను ఆశ్రయించారు. చాలాచోట్ల వైద్యులు వికలాంగుల పట్ల దురుసుగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ప్రతినెలా రూ.1.17 కోట్లు ఆదా

జిల్లావ్యాప్తంగా వివిధ రకాల పెన్షన్లు 2,29,695 లక్షలు ఉన్నాయి. ప్రతినెలా రూ.9774 కోట్లు లబ్ధిదారులకు అందిస్తున్నారు. అయితే వికలాంగుల పెన్షన్ రీవెరిఫికేషన్‌తో పెన్షన్ల మార్పు, రద్దుతో ప్రభుత్వానికి ప్రతినెలా రూ.1.17 కోట్లు ఆదా కానుంది. జిల్లావ్యాప్తంగా పింఛన్ల తనిఖీతో ఇప్పటి వరకూ 2,850 మంది అనర్హులని తేలింది. వీరిలో 2238 మంది వికలాంగ, వృద్ధాప్య పింఛన్లకు అర్హులు. రద్దు, మార్పు చేసిన పింఛన్ల ద్వారా ప్రభుత్వం ప్రతినెలా రూ.1.17 కోట్లు మిగుల్చుకోనుంది.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేసింది. ఈ అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పలుచోట్ల రైతులకు యూరియా దొరక్క ఇక్కట్లు పడుతున్నారన్నారు. యూరియా కోసం పోలవరం మండలం గూటాలలో రైతులు బారులు తీరి ఉండే దృశ్యాలు పత్రికల్లో చూస్తే జిల్లాలో యూరియా కొరత ఏ మేరకు ఉందో అర్థమవుతుందన్నారు. ఒకపక్క జిల్లా కలెక్టర్ రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేస్తున్నామని చెబుతున్నా వాస్తవానికి జిల్లాలో రైతులకు యూరియా కొరత తీవ్రంగా ఉందనేది స్పష్టమవుతుందన్నారు. జిల్లాలో ఆగస్టు నెలలో 10,103 టన్నుల యూరియా అవసరం ఉండగా సరఫరా చేసింది 5,496 టన్నులు మాత్రమేనని అధికారులు లెక్కలు చెబుతున్నారన్నారు. యూరియా కొరత సహజంగా వచ్చింది కాదని, కొందరు వ్యవసాయ శాఖాధికారులు నానో యూరియాను రైతులకు అంటగట్టడం కోసమే కృత్రిమ కొరత సృష్టించారేమోనని అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దీంతో ఎరువుల వ్యాపారులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరియాకు మినహా మిగిలిన ఎరువులన్నింటికీ రాయితీని ఎత్తివేసిందని, ఇప్పుడు యూరియాకు ఇస్తున్న రాయితీని కూడా ఎత్తివేసేందుకే నానో యూరియాను ముందుకు తీసుకువచ్చిందన్నారు. నానో యూరియాకు శాస్త్రీయత లేకపోవడం, రైతులకు పెద్దగా ఉపయోగం కనబడకపోవడంతో రైతులు నానో యూరియా విషయంలో ఆసక్తి చూపడం లేదన్నారు. జిల్లా అధికారులు వెంటనే యూరియా కొరతను నివారించాలని, నానో యూరియాను రైతులకు బలవంతంగా అంటగట్టరాదని, ఎరువుల వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సంతాపం

సిపిఐ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. సుధాకర్ రెడ్డి తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస విడిచే వరకు నిబద్ధతతో, నిజాయితీగా సిపిఐలో కొనసాగారని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాదానికి, కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు.

హెచ్‌ఎంలతో ఎంఇఒ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రజాశక్తిలో శుక్రవారం మోడల్ స్కూల్ ఆచరణ నిల్ అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ముదినేపల్లి ఎంఇఒ-1 మండలంలోని ప్రధానోపాధ్యాయులందరితో శనివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఇఒ-1 రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. రంగాపురం మోడల్ స్కూల్లో బోగస్ రోల్ నమోదు చేస్తున్నట్లు ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 12 అంశాలపై చర్చించారు. ప్రధానంగా మండలంలో ఉన్న స్కూల్లో బోగస్ రోల్ నమోదు చేయకూడదని, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పరిశీలన జరగాలని, పాఠశాలలకు మీడియా వారిని రాకుండా అడ్డుకోవాలని కొంతమంది ప్రధానోపాధ్యాయులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ మంది ప్రధానోపాధ్యాయులు పత్రికా విలేకరులు అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, యాప్‌లో నమోదుపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి ఎంఇఒ-2 నరేష్‌కుమార్ హాజరై వెంటనే కారులో బయలుదేరి వెళ్లారు. సమావేశం చివరి వరకు ఉండలేదు. గంటసేపు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవరత్నం, రామకృష్ణ డిమాండ్ చేశారు. పామాయిల్ కార్మిక సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం రాంబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం, రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదివేల మంది పామాయిల్ కార్మికులు ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వీరితోపాటు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులు మరో రెండు వేల మంది పైగా ఉంటారని, వీరందరిని రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ కార్మికులుగా గుర్తించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు శ్రీను, రాంబాబు, పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఆటో కార్మికులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచి, ఆటో కార్మికులను ఆదుకోవాలని సిపిఎం చింతలపూడి మండల కన్వీనర్ పి.పాండురంగారావు, రామిశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్సుల సంఖ్య పెంచకుండా, సిబ్బందిని పెంచకుండా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల విపరీతమైన రద్దీ పెరిగి ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు ఉపాధి చూపించాలని, లేదా వారిని ఆర్థికంగా ఆదుకోవాలని పేర్కొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ముదినేపల్లి


అవగాహన కల్పిస్తున్న వినయ్‌కుమార్

క్షయ వ్యాధి పట్ల అందరు అప్రమత్తంగా ఉండాలని ఎన్ టి ఎన్ బీ. వి నయ్ కుమార్ అన్నారు. ముదినేపల్లి స్వామ్ ఐటిఐ ప్రైవేట్ కాలేజీలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి పిహెచ్‌సి వైద్యులు వి.శాంతిశ్రీ, స్వామ్ ఐటిఐ ప్రిన్సిపల్ కె.సత్య నారాయణ, ఎన్‌ఎంఎం ఎస్.ఎలినారాణి, వైస్ ప్రిన్సిపల్, కె.హరిత, ఒ.మణిదీపుబాబు, బి.కృష్ణమోహన్, ఎన్‌వి.విజయదుర్గ, జివిఎన్.శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పొంగుటూరు గ్రామంలో మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ.నాలుగు లక్షలు కేటాయించడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపిపి గంజిమాల రామారావు, స్థానిక సర్పంచి రాంబాబు, వైస్ ఎంపిపి, వైసిపి మండలాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, ఖమ్మంపాటి బుజ్జి బాబు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వృధా నీటిని సద్వినియోగం చేసుకోవాలి


ప్రజాశక్తి - ముసునూరు

తమ్మిలేరు నుంచి వృధాగా పోతున్న నీరును సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు సహకరించాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండలంలోని తమ్మిలేరు నుంచి వేల్పుచర్ల, బలివే గ్రామాలకు వెళ్లే సప్లై ఛానల్ దెబ్బతింది. దీంతో తమ్మిలేరు నుంచి నీరు తీసుకొచ్చి బలివే, వేల్పుచర్ల గ్రామాల్లోని చెరువులను నింపాలనే ఉద్దేశంతో ఇరిగేషన్ డిఇఇ వై.అర్జునరావు, టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు పర్యవేక్షణలో పంపింగ్ సిస్టం ద్వారా నీరు తీసుకొచ్చి ఆయా గ్రామాల్లోని కాలువలలోకి ఎత్తిపోతల పథకం ద్వారా అందించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గరికిముక్కు నాని, అబినేని, కె.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.ప్రభుదాస్ అన్నారు. వడాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.సుధారాణి, మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ ఎం.లీలావతి, నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రముఖులు

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య మృతి చెందింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జొన్నవారివారిగూడెం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన తుమ్మిదాల వెంకటాచలం, ఆయన భార్య కృష్ణవేణి(45) శనివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై జంగారెడ్డిగూడెం బయలుదేరారు. ఈ క్రమంలో వారు జొన్నవారివారిగూడెం షుగర్ ఫ్యాక్టరీ సమీపానికి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణవేణి లారీ టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటాచలానికి స్వల్ప గాయాలయ్యాయి. కళ్లముందే భార్య చనిపోవడంతో వెంకటాచలం కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంతో నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేసి కృష్ణవేణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

తప్పిన ప్రమాదం

జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన శ్రీ రామచంద్ర విద్యా సంస్థలకు చెందిన బస్సు అమ్మపాలెంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. బస్సును రివర్స్ చేసే సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ స్తంభం కింద భాగం మొత్తం రెండు ముక్కలుగా విరిగిపోయింది. బస్సులో విద్యార్థులకు ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ బస్సులను డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని గ్రామస్తులు కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మంత్రి పార్థసారధి
ఘనంగా 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


ఆగిరిపల్లిలో..

ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గాయని, పరిశుభ్రత ప్రతిఒక్కరీ జీవితంలో భాగం కావాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండల పరిధిలోని బొద్దనపల్లి శివారు శోభనాపురంలో జరిగిన స్వచ్ఛంద్రా-స్వర్ణాంద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని వీధులను ఊడ్చటం, డ్రెయినేజీల్లో పూడిక తీయటం, ఆయిల్ బాల్స్ వేయటం వంటి కార్యక్రమాలు స్వయంగా చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అనంతరం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పారిశుధ్య కార్మికులు సీతా రాంబాబు, పేరంటాలమ్మను సన్మానించి, ఆయన సొంత నగదు రూ.ఏడు వేలు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ బి.వినూత్న, ఆగిరిపల్లి ఎంపిడిఒ బి.భార్గవి, టిడిపి మండలాధ్యక్షులు ఎన్.వేణు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి : ఏలూరును రాష్ట్రంలోనే పరిశుభ్రత జిల్లాగా తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గుర్వాయిపాలెం పంచాయితీ పరిధి మద్వానిగూడెం, చిన తాడినాడ, సోమేశ్వరం గ్రామాల్లో జరుగుతున్న కొల్లేరు ప్రక్షాళన పనులు, గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులను ఎంఎల్ఎ, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని అన్నవరంలో ఉన్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, జీవ శాస్త్ర ఉపాధ్యాయులు దుర్గామల్లేశ్వరరావు మాట్లాడారు.

భీమడోలు : ఆరోగ్య భద్రతకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ పిజె.జాన్‌అబ్రహం కోరారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.అరుణజ్యోతి, ఆరోగ్య విస్తరణాధికారి వైవి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జిల్లా వైద్యారోగ్య అధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆమె వివిధ విభాగాలను తనిఖీ చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలింతతో ప్రసవానికి ముందు, తర్వాత కొనసాగుతున్న వైద్య సేవల గురించి అడిగారు.

ఏలూరుసిటీ : ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి హాజరైన ఎంఎల్ఎ బడేటి చంటి పరి సరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏలూరు 36వ డివిజన్‌లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభ లో పరిసరాల పరిశుభ్రతలో ఉత్తమ పనితీరు కనపరిచిన నలుగురు శానిటరీ సిబ్బందికి నగదు అందించారు. ఒక్కొక్క రికి రూ.ఐదు వేల చొప్పున తన సొంత నగదును అందిం చారు.

జీలుగుమిల్లి : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని వైద్యాధికారి బి.గాయత్రి అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీలుగుమిల్లి పిహెచ్‌సిలో సిబ్బందితో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. శ్రీ విద్యా నిధి పాఠశాల ఆవరణలో అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. మండలంలోని పి.అంకంపాలెం, దర్భగూడెం గ్రామల్లో సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సభ్యులు ఎన్.శ్రీను ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు.

చింతలపూడి : వర్షాకాలంలో మురుగునీటిని దూరం చేసి, పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమల నుంచి వచ్చే జ్వరాలను జయించవచ్చని చింతలపూడి ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సమన్వయకర్త జి.జీవన మౌనిక మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేసి కళాశాల నీటి ట్యాంకులను, తరగతి గదులను ప్రాంగణాన్ని శుభ్రపరచి దోమల మందు పిచికారీ చేశారు.

ముసునూరు : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పి.రాజకుమారి, హెల్పర్ దైవకృప, ఎంపిపి స్కూల్ ఉపాధ్యాయులు బెనర్జీ మాస్టారు, ఎంఎల్‌హెచ్‌పి జమున, గ్రామ పెద్దలు జోను బోయిన రాంబాబు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ జె.కల్పనారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆసుపత్రి పరిసరాల్లో వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువులు తొలగించారు. ఈ సందర్భంగా చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్‌ఎ.ప్రసాద్ మాట్లాడారు.

దెందులూరు : దెందులూరులో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కృష్ణుడి ఆలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు.

పోలవరం : పోలవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా మురికి గుంటల్లో, డ్రెయినేజీల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

పురుగుమందులు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పలు ఎరువుల షాపులను తహశీల్దార్ బి.బద్రునాయక్, వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎరువుల దుకాణాల్లో ఎంత మోతాదులో ఎరువుల లభ్యత ఉన్నదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎరువుల డీలర్లుకు పలు సూచనలు చేశారు. రైతులందరికీ బయోమెట్రిక్ విధానంలోనే ఎరువులను విక్రయించాలని తెలిపారు. రైతులందరూ కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా బిల్లులు పొందాలన్నారు.

భీమడోలు : ఎరువులు, పురుగు మందుల అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడినా, నల్ల బజారులో అమ్మేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ బి.రమాదేవి హెచ్చరించారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి ఉషారాణి, మత్స్య అభివృద్ధి అధికారి, పౌరసరఫరాల మండల శాఖాధికారి అధికారుల బృందం శనివారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఎరువులు, పురుగు మందుల షాపులను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. నిల్వలను లెక్క కట్టారు. షాపులు వద్ద ఎరువులకు వచ్చిన రైతులతో మాట్లాడారు. మండలంలో ఎరువుల కొరత లేదని, సమస్యలను అధిగమించేందుకు డీలర్లు రైతులకు సహకరించాలని కోరారు. వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ రైతులు రాయితీపై ఇస్తున్న యూరియా స్థానంలో దానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం విడుదల చేసిన నానో యూరియాను వాడాలని సూచించారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని లక్కవరంలో ఎరువుల షాపులను జంగారెడ్డిగూడెం తహశీల్దార్ స్లీవ జోజి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని ఎరువుల షాపుల యాజమాన్యాన్ని కోరారు. అనంతరం రైతులతో మాట్లాడి యూరియా కొరతపై అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఎరువుల దుకాణాల యాజమాన్యాలు యూరియా బస్తాలను ఎక్కువ ధరలకు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొయ్యలగూడెం : ఎంఆర్‌పికే ఎరువులను విక్రయించాలని జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటరమణ అన్నారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రైతుల వద్ద నుంచి ఎరువుల కొనుగోలు విధానంపై ఆరా తీశారు. ఎడిఎ బుజ్జిబాబు మాట్లాడుతూ రైతులంతా రసాయన ఎరువులే కాకుండా నానో ఎరువులను కూడా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, మండల వ్యవసాయాధికారి పోసారావు, ఆర్ఐ మణి దివ్య, విఆర్ఒ బట్టు వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : యూరియా కృత్రిమ కొరత చూపిస్తే చర్యలు తప్పవని దెందులూరు తహశీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. మండలంలోని కొవ్వలి గ్రామంలోని దెందులూరు మండల వ్యవసాయాధికారి సమక్షంలో యూరియా స్టాకు పరిశీలించారు. సదరు స్టాకులో వ్యత్యాసాలు లేవని గుర్తించారు.

పలు సొసైటీల తనిఖీలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కృష్ణారావుపేట, పట్టిసీమ, గుటాల సహకార సంఘాలను జిల్లా సహకార శాఖాధికారి ఆరిమిల్లి శ్రీనివాస్, విభాగ సహకార అధికారి కె.సత్యవతి శనివారం సందర్శించి ఎరువుల గోడౌన్‌లను తనిఖీ చేసి ఎరువుల అమ్మకాలను, మిగులు నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి గుటాల గ్రామ రైతులతో మాట్లాడుతూ జిల్లాలో యూరియా రైతుల అవసరాలకు సరిపడా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో మండల వ్యవసాయాధికారి రాంబాబు, కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, పాత పట్టిసీమ అధ్యక్షులు సునకాని రాంబాబు, కొత్త పట్టిసీమ ప్రత్యేకాధికారి ఎస్‌కె.నజీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాజవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్‌సి) కంటి వైద్యుడు డాక్టర్ సిహెచ్.చక్రవర్తి 310 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 14 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి కళ్లజోడు అవసరమని నిర్ధారించి, ఏలూరు ఆంధత్వ నివారణ సంస్థకు సమాచారం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బయ్యనగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్ భాషా, ఎఎన్‌ఎం పి.సుజాత, ఆశా కార్యకర్తలు సిహెచ్.సువార్త, కె.ప్రభావతి పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో పోక్సో యాక్ట్-2013పై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగమణి హాజరయ్యారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు మాట్లాడుతూ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహార చర్యల ప్రాముఖ్యతను తెలియజేశారు. కోఆర్డినేటర్ టివిఎస్.పద్మావతి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ విధుల గురించి వివరించారు. ముఖ్య అతిథి వి.అమర శ్రీనివాస్ పోక్సో యాక్ట్ ముఖ్య అంశాలను, గుడ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

'మహిళా సాధికారతకు సిఎం కృషి'

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబు మహిళా సాధికారతకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తున్నారని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని పోతునూరు సొసైటీ వద్ద స్త్రీ శక్తి, సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇసిసి డే

ఏలూరు సిటీ : ఏలూరులోని 41 డివిజన్‌లో రహమత్‌నగర్, జయప్రకాష్ సెంటర్ అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం ఇసిసి డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలూరు సిడిపిఒ పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జోషి, అంగన్వాడీ కార్యకర్తలు నవతీ, ఝాన్సీ, లక్ష్మి, ఆయాలు, ప్రీస్కూల్ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

'శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రిన్సిపల్ సరళ

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అభినందనీయులని సిఆర్.రెడ్డి ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ జి.సరళ అన్నారు. సిఆర్.రెడ్డి ఉమెన్స్ కాలేజీలో సంస్థ సభ్యులు ఆ కాలేజీలో బికాం ప్రథమ సంవత్సరం చదువుతున్న పెదవేగి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన ఈర్ల శ్రీనివాసరావు కుమార్తె ఈర్ల కోమలరాణికి రూ.పదివేలు, శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న శనివారపుపేట గ్రామానికి చెందిన కొండపల్లి కావ్యకు కాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.పది వేలు ప్రిన్సిపల్ చేతుల మీదుగా ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు డాక్టర్ గుగులోతు కృష్ణ, మానవత ఫౌండేషన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.అజయ్‌బాబు, శనివారపుపేట 26 డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి సిహెచ్.గణేష్, డాక్టర్ కలిసా, శనివారపుపేట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు గారపాటి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణం దుర్వినియోగం!

రెండు గ్రూపుల్లో విఒఎలు రూ.పది లక్షల మేర కాజేసినట్లు ఫిర్యాదు
ఎజిఎం చెన్నకేశవుల విచారణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళలు వ్యక్తిగత రుణాల కోసం ప్రయివేట్ ఫైనాన్స్‌లను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా అవసరమైన వారికి వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తుంది. దీనిలో భాగంగా మండల వ్యాప్తంగా పలు గ్రూపులకు రుణాలుమంజూరు చేసింది. అయితే స్త్రీ నిధి రుణాల చెల్లింపులో సభ్యుల నుంచి నగదు వసూలు చేసి విఒఎలు బ్యాంకులకు జమ చేయకుండా దుర్వినియోగం చేసినట్లు పలువురు ఎజిఎంకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం విజయవాడ నుంచి ఎజిఎం చెన్నకేశవులు దధ్వర్యంలో స్త్రీ నిధి బృందం విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా మండలంలోని జీలుగుమిల్లి, దర్భగూడెం గ్రామాల్లోని రెండు గ్రూపులకు సంబంధించి తీసుకున్న స్త్రీ నిధి రుణాల సభ్యుల నుంచి వివరాలు సేకరించగా వారు రుణాన్ని విఒఎలకు అందించి నట్లు తెలిపారు. అనంతరం విఒఎలను విచారణకు రావా లని ఆదేశించగా ఇద్దరు విఒఎలు విచారణకు హాజరు కాకుం డా డుమ్మా కొట్టినట్లు చెబుతున్నారు. సభ్యులు చెప్పిన వివరా ల ప్రకారం ఇద్దరు విఒఎలు ఐకెపి జీలుగుమిల్లి, బాపూజీ కాలనీ రెండు గ్రూపుల్లో సుమారు రూ.పది లక్షల మేర సొమ్ము వాయిదాలు చెల్లించకుండా కాజేసినట్లు వెల్లడైం ది. దీనిపై పూర్తి స్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిం చనున్నట్లు స్త్రీ నిధి బృందం తెలిపారు. ఈ విచార ణలో జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరేంద్ర, బాలాజీ జంగారెడ గూడెం స్త్రీ నిధి మేనేజర్ నవత, ఎపిఎం శ్రీనివాస్ ఉన్నారు.

వినియోగదారుల కోసం విశిష్టమైన సేవలు : బిఎస్‌ఎన్‌ఎల్

ఏలూరు సిటీ : భారత్ సంచార్ నిగం లిమిటెడ్ సంస్థ వినియోగదారుల సౌకర్యార్థం అందుబాటులో విశిష్టమైన సేవలు టెలికాం రంగంలో అందిస్తున్నామని బిఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల కోసం ఒక రూపాయికి సిమ్ కార్డు నెలరోజుల వ్యాలిడిటీ, అన్ లిమిటెడ్ కాల్స్, 2 జిబి డేటా, రోజుకు వంద ఎస్‌ఎంఎస్‌లతో అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఫైబర్ టివి బేసిక్ ప్లాన్ ద్వారా కేవలం రూ.400 ఇంటర్నెట్‌తో పాటు 444 టీవీ ఛానెల్స్, తొమ్మిది ఒటిటి ఛానల్స్ అందిస్తున్నామని తెలిపారు.

సురవరం మృతి తీరని లోటు

ప్రజాశక్తి - చింతలపూడి

సురవరం సుధాకర్ రెడ్డి మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచర్ల గురవయ్య, కృష్ణ, తొర్లపాటి రాజు, కొల్లూరి సోమశేఖర్, మండల కమిటీ సభ్యులు బి.వజ్రం, జంగా రామచంద్రారెడ్డి, మస్తాన్, జి.అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : సిపిఐ అగ్ర నాయకులు, జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శిగా, ఎంపీగా ప్రజా సమస్యలపై సురవరం ఎనలేని పోరు సాగించారన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సిపిఐ నూజివీడు నియోజకవర్గ సమితి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ సంతాపం తెలిపారు.

కొయ్యలగూడెం : సురవరం సుధాకర్ రెడ్డి మృతి సిపిఐకి తీరని లోటని సిపిఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు అన్నారు. పట్టణంలో ముఠా కార్మికులతో కలిసి సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి లక్క లక్ష్మణరావు, ఎఐటియుసి నాయకులు వెలగల నాని, మట్టా రామకృష్ణ, పులపాకుల దుర్గారావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KURAPATI DHARMASWAMY (Old name) Son of KURAPATI SHOBANADRI , R/o Door.No. 2-41/1, Opposite Vetarnity Hospital, Pedavegi, West Godavari District, PIN-534475, have changed my name KURAPATI DHARMA SWAMY to KURAPATI DHARMASOMALINGESWARA RAO (new name) same as intimated to The General Public

పేరు మార్పు/ సవరణ

నేను అద్దంకి రత్నకుమారి W/o A. తాతారావు, నివాసం : డోర్‌నెం. 23ఎ-4-9/1, భగత్‌నగర్ వీధి, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా.
ప్రస్తుతం నా యొక్క ఆధార్‌కార్డులో నా పేరు **అద్దంకి రత్నకుమారి** అని తప్పుగా నమోదు కాబడినది. నా యొక్క ప్రస్తుత, అసలు పేరు **అద్దింటి రత్నకుమారి** W/o **అద్దింటి తాతారావు** (ADDINTI RATNA KUMARI, W/o ADDINTI TATA RAO) గా మార్పు చేయుట జరుగుతుంది. కావున నేటి నుండి నా పేరును **అద్దింటి రత్నకుమారి**గా పిలవబడును. ఆధార్‌లో మార్పుకొరకు

పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఆదివాసీ మహాసభ అధ్యక్షులు వెంకటస్వామి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షులు మీడియం వెంకటస్వామి అన్నారు. మండలం లోని దేవరగొందిలో ఆదివాసి మహాసభ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా మీడియం వెంకటస్వామి మాట్లాడుతూ పోలవరం, రంపచోడవరం విలీన మండలాలతో పోలవరం జిల్లా కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కోసం పోరాడుతున్న జిల్లా సాధన సమితి వారికి ఆదివాసీ గిరిజన మహాసభ మద్దతిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వరస బుచ్చమ్మ, వరస జోగమ్మ, తాతి సరస్వతి, తాతి భవాని, లేసిక అక్కమ్మ, కొలుతుల బుచ్చమ్మ, చోడే భవాని, కొక్కెర రాంబాబు, మడకం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ప్రధాన ఆశయంతో ఈషా ఫౌండేషన్ గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా 17వ గ్రామోత్సవాన్ని జంగారెడ్డిగూడెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జాతీయ జెండా ఆవిష్కరణతో ఈ కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కెవి.రమణ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ ఇషా ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడలను ప్రోత్సహిస్తున్న ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని ఎంఆర్.అప్పారావు కాలనీ, అమ్మవారి తోట అంగన్వాడీ సెంటర్లలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పోక్సో బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, ఎఎన్ఎం శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, అంగన్‌వాడీ వర్కర్ ఎస్‌కె.మోహలాభి, ఆశావర్కర్ ఎం.లక్ష్మి, పారా లీగల్ వాలంటీర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెరుచుకున్న రైల్వే గేటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుడివాడ -ముదినేపల్లి జాతీయ రహదారిలో మల్లయ్యపాలెం వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి మూసివేసిన రైల్వే గేటును శనివారం తెరిచారు. గత 14 రోజులుగా ఈ గేటును రైల్వే అధికారులు మూసి వేయడంతో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి బైక్‌తో సహా ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాలను వివిధ రూట్లలో మళ్లించారు. మల్లయ్యపాలెం రైల్వే గేట్ పనులు పూర్తి కావడంతో రైల్వే గేటును తెరిచి అన్ని వాహనాలను అనుమతించారు.

ప్రకటన

శ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఒ.యస్.నెం.585/2022

బిట్వీన్ :
దాసిరెడ్డి లక్ష్మి కొండాలమ్మ ...వాది
మరియు
1.యెలిశెట్టి వెంకట మోహన్
2.బొడ్డు ఆశాజ్యోతి ...ప్రతివాద్లు

పై నెంబరు దావాలో మీలో రెండవ ప్రతివాది బొడ్డు ఆశాజ్యోతి, C/o.యెలిశెట్టి వెంకట మోహన్, వానపల్లిగూడెం, 1వ వార్డు, తాడేపల్లిగూడెం అను మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసుకొనక నిరాకరించుచున్నారు. కావున మీరు ది.11-09-2025 సం॥తేదీ ఉదయం గం.10-30 ని॥ల లగాయితూ శ్రీకోర్టు వారి ఎదుట హాజరయి మీ సంజాయిషీ స్వయముగా కాని ప్లీడరు గారి ద్వారా గాని తెలుపుకొనవలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

పి.ఆంజనేయరాజు, అడ్వకేటు,
తాడేపల్లిగూడెం.
సెల్: 9848018256

మహారాజశ్రీ 4వ ఎడిషనల్ సివిల్ కోర్టు, ఏలూరు, ఏలూరు జిల్లా.

ఓ.ఎస్.నెం.121/2025

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంచ్ మేనేజర్, వట్లూరు ...వాది
బిట్వీన్
1.జయమంగళ శ్రీ నాగదేవి (భర్త) వెంకట శ్రీనివాస్
2.జయమంగళ వెంకట శ్రీనివాస్, S/o.జయరాజు
వడ్డీగూడెం, గ్రామం, పెదపాడు మండలం,
ఏలూరు జిల్లా. ...ప్రతివాదులు

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు తెలియజేయునది ఏమనగా పై తెలిపిన కోర్టులో ది.**03-09-2025**వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చు కొనవచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షంగా, తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.

కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్,
స్థలం: ఏలూరు పానుగంటి వారి వీధి, ఏలూరు.
తేది.23-08-2025 సెల్: 9441276324